ఎస్ఎల్‌బీసీపై ఆంధ్రజ్యోతి అవాస్తవాలు

- టన్నెల్‌ను 11.48 కిలోమీటర్లు తవ్వాం
- టీబీఎం టెక్నాలజీతోనే పనులు జాప్యం
- మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, ఏప్రిల్18 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కిలోమీటర్ మాత్రమే కొనసాగాయనేది అవాస్తవమని, 11.48 కిలోమీటర్ల మేర పనులు జరిగాయని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. పనుల జాప్యానికి టన్నెల్ బోరింగ్ మిషన్ టెక్నాలజీ, టన్నెల్‌లో సీపేజీనే ప్రధాన కారణమని తెలిపారు. ఏప్రిల్ 18న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఎస్ఎల్‌బీసీ టన్నెల్ 33 నెలల్లో పూర్తి' శీర్షికతో వచ్చిన వార్తలో అవాస్తవాలను ప్రచురించారని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఏర్పడేనాటికి పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులపై రివ్యూ చేసి, త్వరగా పూర్తి చేయాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తుచేశారు. అందులో ఎస్ఎల్‌బీసీ కూడా ఉన్నదని, 2005లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి నుంచి నత్తనడకననే సాగిందని వివరించారు. ఇందుకు అనేక సాంకేతిక, భౌగోళిక పరిస్థితులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కారణమని మండిపడ్డారు. '43.93 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేనాటికి 33 కిలోమీటర్ల టన్నెల్ తవ్వారని ఆ వార్తలో ప్రచురించారు. అది అవాస్తవం. 2014 జూన్ నాటికి 22.89 కిలోమీటర్ల వరకు మాత్రమే టన్నెల్ తవ్వారు. అందుకు రూ.1,248 కోట్లు ఖర్చు పెట్టారు. బీఆర్ఎస్ సర్కారు వచ్చాక అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా పనులు చేయించాం. ఉమ్మడి ఏపీలో పెండింగ్‌లో ఉన్న భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌తో పాటు ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కూడా త్వరగా పూర్తి చేయాలని నిర్ణయించి మొదటి ఏడాది బడ్జెట్లోనే నిధులు కూడా కేటాయించాం' అని తెలిపారు. అనేక ఆధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నా అప్పటి ప్రభుత్వం టన్నెల్ బోరింగ్ మిషన్ అనే పాత పద్ధతి ద్వారా సొరంగం తవ్వాలని నిర్ణయించిందని, ఇదే పనుల జాప్యానికి కారణమని వివరించారు. అదీగాక బోరింగ్ మిషన్ తరచూ రిపేర్లకు గురవటం, విదేశీ నిపుణులు వచ్చి రిపేర్ చేసేందుకు నెలల కొద్దీ సమయం పట్టడం కూడా జాప్యానికి కారణమని వెల్లడించారు. వర్షాకాలంలో శ్రీశైలంలో ఎక్కువ నీళ్లు వచ్చినప్పుడు ఈ టన్నెల్‌లోకి కూడా నీరు వస్తుందని, వీటిని బయటకు పంపి మళ్లీ పని ప్రారంభించడానికి సమయం పట్టేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 22.89 కిలోమీటర్ల నుంచి తవ్వకం ప్రారంభించి, 2023 డిసెంబర్ నాటికి 11.48 కిలోమీటర్ల మేర తవ్వినట్టు వివరించారు. అందుకు రూ.1,1117 కోట్లు ఖర్చు పెట్టామని, మొత్తంగా ఇప్పుడు టన్నెల్ 34.37 కిలోమీటర్ల మేర తవ్వకం పూర్తయిందని తెలిపారు. ఇంకా 7 కిలోమీటర్ల పని మాత్రమే మిగిలి ఉన్నదని వెల్లడించారు. ఏడాదికి రెండున్నర కిలోమీటర్లు మాత్రమే తవ్వటం సాధ్యమవుతుందని వివరించారు. సర్కారు మిగతా పనిని మూడేండ్లలో పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని హరీశ్ డిమాండ్ చేశారు.

2 లక్షల రుణమాఫీ ఏమాయె?

- రైతులను నమ్మించి మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఓట్ల కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ లీడర్లకు బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా బెజ్జంకి రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

సిద్దిపేట, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'ఎన్నికల్లో రైతులు, ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. వద్దురో.. ఈ కాంగ్రెస్ పాలన అని ప్రజలు మొత్తుకుంటున్నారు' అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. డిసెంబర్ 9నే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో పార్టీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నది. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఆ ఊసే ఎత్తడం లేదు. రూ.2 లక్షల రుణమాఫీ ఏమైంది? మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఏమయ్యాయి? ప్రభుత్వంపై రైతులకు నమ్మకం లేక బయట రూ.1,800కే ధాన్యం అమ్ముకుంటున్నారు. పంట చేతికి వచ్చినా ఇంతవరకు రైతు బంధు వేయని కాంగ్రెస్ ప్రభుత్వంకు రైతులు తగిన గుణపాఠం చెప్పాలి. రెండు నెలల్లో లక్ష లగ్గాలు జరిగాయి. వీరికి రేవంత్‌రెడ్డి లక్ష తులాల బంగారం బాకీ ఉన్నాడు. ఆరు గ్యారంటీలే గడ్డపారలై రేవంత్‌కు పోటు పొడవాలి. నాలుగు నెలలైన హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు మళ్లీ ఓటేసి మోసపోదామా?' అని ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఓట్ల కోసం వస్తే కాంగ్రెస్ లీడర్లకు బుద్ధి చెప్పడానికి మహిళలు చీపుర్లు, చాటలతో సిద్ధంగా ఉండాలని అన్నారు. ఆడపిల్లల పెండ్లి తులం బంగారం ఇస్తానని మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని హరీశ్‌రావు విమర్శించారు. బెజ్జంకి అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే, వాటిని ఈ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. బీజేపీ పదేండ్ల పాలనలో ప్రజలకు ఒక్క మేలైనా చేసిందా? అని ప్రశ్నించారు. చెప్పుకోవటానికి ఏమీలేక క్యాలెండర్లు, అక్షింతలు పంచుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రశ్నించే గొంతులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ కరీంనగర్‌కు రైలు తీసుకొచ్చారు. కోట్ల నిధులు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. కాంగ్రెస్ నేతలు నేలకు దిగిరావాలంటే కరీంనగర్ పార్లమెంట్ నుంచి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి' అని కోరారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలో రూ.కోట్ల నిధులు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతుకగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

లోకం పోకడ

పాపం, బయటికెళ్తే ఎండల సెగ, పార్టీ కార్యాలయాని కొస్తే అసమ్మతి సెగ!

కడియం శ్రీహరి ఓ బ్లాక్ మెయిలర్

బీఆర్ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ ఇన్‌చార్జి, మాజీ ఉప ముఖ్యమంత్రి టీ రాజయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఓ బ్లాక్ మెయిలర్, అవకాశవాదని బీఆర్ఎస్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి టీ రాజయ్య విమర్శించారు. కడియం శ్రీహరి ఫ్యామిలీ నైతికంగా పతనమైందని, రాజకీయ ఊసరవెల్లిలా పార్టీలు మారుతున్నారని విమర్శించారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరిని వరంగల్‌లో ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. కడియం కావ్య, శ్రీహరి గురించి ఘోరంగా మాట్లాడుకుంటున్నారని తెలిపారు. గతంలో చంద్రబాబు, తర్వాత కేసీఆర్ వంచన చేరిన శ్రీహరి, ఇప్పుడు కాంగ్రెస్ చంకలో చేరారని ఎద్దేవా చేశారు. ఆరు నెలల్లో రేవంత్ ప్రభుత్వం కూలిపోతుందన్న ఆయన ఇప్పుడు ఆ పార్టీలోకి ఎందుకు వెళ్లారని నిలదీశారు. కాంగ్రెస్‌లో పది గ్రూపులు తయారయ్యాయని, కడియం పరిస్థితి కూడా కష్టంగా మారిందని చెప్పారు. తనకు వరంగల్ లోక్‌సభ భాద్యతలు కేసీఆర్ అప్పగించారని చెప్పారు. గతంలో తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినా దానిని కేసీఆర్ ఆమోదించలేదని తెలిపారు.

బీజేపీతో టచ్‌లోకి కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే?

- పోలింగ్‌కు ముందు ఈడీ తాఖీదులు
- తప్పించుకునేందుకు బీజేపీతో చర్చలు!
- అసోం సీఎంతో రాజీయత్నాలు
- రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ, ఎమ్మెల్యే బీజేపీలోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. వేర్వేరు కేసుల్లో ఇద్దరికీ నోటీసులు ఇచ్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతుండడంతో దాని నుంచి తప్పించుకునేందుకు కాషాయ కండువా కప్పుకోవాలని భావిస్తున్నారట. పోలింగ్‌కు ఒకట్రెండు రోజుల ముందు ఈడీ వారికి తాఖీదులు ఇవ్వనున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో దాని నుంచి తప్పించుకునేందుకు బీజేపీకి దగ్గర కావాలని యోచిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. బీజేపీతో టచ్‌లోకి వెళ్లిన ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎంపీకూడానని, అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఆయనకు ఈడీ నుంచి నోటీసులు అందినట్టు సమాచారం. ఇప్పుడాయనను ప్రశ్నించేందుకు సమన్లు కూడా ఇవ్వనున్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఆయన సన్నిహితుడు లోక్‌సభ బరిలో నిలవడంతో ఆ ప్రభావం ఎన్నికలపై పడే అవకాశం ఉందని భయపడుతున్నట్టు సమాచారం.

రుణం ఎగవేత కేసులో ఎంపీ

బీజేపీతో టచ్‌లోకి వెళ్లిన ఎంపీ రుణం ఎగవేత కేసులో ఈడీ విచారణను ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడుతున్నట్టు తెలిసింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆయనపై గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థలకు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ ఫిర్యాదు ఆధారంగానే ఈడీ రంగంలోకి దిగుతున్నదని సమాచారం. అదే జరిగితే తన గెలుపు కష్టమేనని వారు భావిస్తున్నారట. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే, ఎంపీ ఇద్దరూ తమకు తెలిసిన మార్గాల ద్వారా అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వశర్మను ఆశ్రయించి చర్చలు జరిపినట్టు ప్రచారం జరుగుతున్నది.

అధిష్ఠానాలు గుర్రు

కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ బీజేపీతో టచ్‌లోకి వెళ్లిన విషయం తెలిసిన ఇరు పార్టీల అధిష్ఠానాలు గుర్రుగా ఉన్నట్టు సమాచారం. తమ అనుమతి లేకుండా చర్చలు జరపడంపై బీజేపీ, ఈ విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని కాంగ్రెస్ ఆగ్రహంతో ఉన్నాయని తెలిసింది. ఆయా పార్టీల రాష్ట్ర ఇన్‌చార్జీలు వారిపై ఓ కన్నేసి ఉంచినట్టు సమాచారం. ఈ విషయం కాస్త బయటకు పొక్కడంతో రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.

కోమటిరెడ్డి బ్రదర్స్ రాజకీయ బ్రోకర్లు

- వాళ్లిద్దరూ నల్లగొండ జిల్లాకు పట్టిన శని
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 18 : 'కోమటిరెడ్డి బ్రదర్స్ రాజకీయ బ్రోకర్లు.. పదవులు, డబ్బుల కోసం ఎంతకైనా దిగజారుతారు' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దుయ్యబట్టారు. నల్లగొండలో గురువారం ఆయన మాట్లాడుతూ రేవంత్ మెప్పు కోసం పోటీపడి ఆయన బూట్లు నాకుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను విమర్శించే హక్కు కాంగ్రెస్ నేతలకు లేదని, ఆయన జోలికొస్తే ప్రజలే తరిమి కొడతారని హెచ్చరించారు. రాజకీయాన్ని వ్యాపారం చేసి పార్టీని, నమ్మినవాళ్లను మోసం చేసిన చీటర్స్ కోమటిరెడ్డి బ్రదర్స్ అని మండిపడ్డారు. రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌ను మోసం చేసి బీజేపీ నుంచి పోటీ చేస్తే, కాంగ్రెస్‌లో ఉండి వెంకట్‌రెడ్డి తన తమ్ముడికి ఓటెయ్యాలని కోవర్టు రాజకీయాలకు పాల్పడలేదా? అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు నీతి, నిబద్ధత లేదని, వాళ్లు నల్లగొండ జిల్లాకు పట్టిన శని అని ఎద్దేవాచేశారు. డబ్బులిచ్చి పీసీసీ పదవి కొన్నాడని నాడు రేవంత్‌ను విమర్శించి, నేడు పదవుల కోసం తమను తామే అమ్ముకుంటున్నారని విమర్శించారు. 'రేవంత్ 120 రోజులు కాదు గదా, 1,020 రోజులు పాలించినా ప్రయోజనం ఉండదు' అని కుండబద్దలు కొట్టారు. రాహుల్ గాంధీ దేశానికి దెయ్యం అని మోదీ అంటే, 'బడేభాయ్ సహకారంతో తెలంగాణను గుజరాత్‌కు రోల్ మాడల్ చేస్తా'మని చోటేభాయ్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 'గుజరాత్ మాడల్ అంటే మర్డర్లు, ఆడపిల్లలపై అఘాయిత్యం చేసినోళ్లను జైళ్ల నుంచి విడిపించడం, కుల ఘర్షణలు, ఊచకోతకోయడమా?' అని ప్రశ్నించారు. రేవంత్ త్వరలో బీజేపీలోకి పోతారని ఆయన మంత్రులే లీకులిస్తున్నారని తెలిపారు. జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఉన్నారు.

తమిళనాడు కోసం తెలంగాణ పణం



ఛత్తీస్‌గఢ్‌ను ముందుపెట్టి సమ్మక్క బరాజ్‌కు ఆంక్షలు

ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి మరో అడ్డంకిగా దిగువన ములుగు జిల్లాలో తుపాకులగూడెం వద్ద గోదావరిపై తెలంగాణ నిర్మించిన సమ్మక్క బరాజ్ నిలుస్తున్నది. ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మిస్తే, సమ్మక్క బరాజ్ నీటి నిల్వ సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో గోదావరి-కావేరి లింక్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి నుంచీ అడ్డు చెప్తూ వచ్చింది. దీంతో సమ్మక్క బరాజ్ అంశాన్ని కూడా ఉనికిలో లేకుండా చేసేందుకు బీజేపీ సర్కారు కుట్రలకు తెరలేపింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజేపీ సర్కారును ముందుపెట్టి తెరవెనక రాజకీయాలు కొనసాగిస్తున్నది. కేంద్రం కుట్రలకు ఛత్తీస్‌గఢ్ సర్కారు సైతం వంతపాడుతున్నది. నిన్నమొన్నటి తాము వినియోగించుకోని 148 టీఎంసీల నికర జలాలను తరలించుకుపోయేందుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ససేమిరా అన్నది. ఇటీవల అక్కడ బీజేపీ ప్రభుత్వం రావడంతో మాట మారింది. నికర జలాల తరలింపునకు సంసిద్ధత వ్యక్తంచేసింది. ఈ విషయాన్ని ఎన్‌డబ్ల్యూడీఏనే రాష్ట్రాలకు వెల్లడించింది.

మొదటిపేజీ తరువాయి...

బీజేపీ ఎప్పటినుంచో విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. కానీ, పట్టు చిక్కడం లేదు. దీంతో తాజాగా తమిళనాడు మీద దృష్టి పెట్టింది. తమిళనాడు ఎదుర్కొంటున్న తీవ్రమైన సాగు, తాగు నీటి కొరతనే ప్రధాన అస్త్రంగా ఎంచుకొని, ఆ రాష్ట్రంలో పాగా వేసేందుకు పావులు కదుపుతున్నది. రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, మొండిగా గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై ముందుకు పోతున్నది. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 148 టీఎంసీల నికర జలాలను కావేరికి తరలించాలని నిర్ణయించింది. అందుకోసం ఇచ్చంపల్లి వద్ద బరాజ్‌ను నిర్మించి అక్కడి నుంచి కాలువ ద్వారా మూసీకి, ఆ తరువాత నాగార్జునసాగర్‌కు, అక్కడి నుంచి ఏపీలోని సోమశిల రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి తమిళనాడులోని మమండూర్ ట్యాంక్‌కు, ఆ తరువాత మనిముక్త నది వరకు గోదావరి జలాలను తీసుకెళ్లనున్నది. 1,085 కిలోమీటర్ల దూరంలోని తమిళనాడు ప్రాంతానికి నీళ్లను తరలించేందుకు గోదావరి ఒడ్డునే ఉన్న తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నది. అందుకోసం తెలంగాణ ప్రాజెక్టును సైతం బలిపెట్టేందుకు సిద్ధమవుతున్నది. మేడిగడ్డ, సమ్మక్క బరాజ్‌లపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలే ఇందుకు బలాన్నిస్తున్నాయి.

ఎన్డీఎస్ఏను పావుగా చేసి మేడిగడ్డ నిర్వీర్యం

తమిళనాడులో బీజేపీ లక్షిత రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునే వ్యూహంలో భాగంగా ఇచ్చంపల్లి వద్ద బరాజ్‌ను నిర్మించాలంటే, కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ బరాజ్ ప్రధాన అడ్డంకిగా నిలుస్తున్నది. ఇచ్చంపల్లి వద్ద బరాజ్‌ను నిర్మిస్తే, అక్కడి బ్యాక్‌వాటర్ ఎగువన మేడిగడ్డ బరాజ్ వరకూ విస్తరిస్తాయి. అది మేడిగడ్డ ప్రాజెక్టు ఉనికికే ప్రమాదంగా పరిణమిస్తుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం ఆది నుంచీ ఇచ్చంపల్లిని వ్యతిరేకిస్తూ వచ్చింది. దీంతో ఇప్పటివరకు కేంద్రం ముందుకు పోలేకపోయింది. ఇప్పుడు మేడిగడ్డ బరాజ్ కుంగుబాటును ఆసరాగా చేసుకొని, ఎన్డీఎస్ఏను అడ్డం పెట్టుకుని కేంద్రంలోని బీజేపీ సర్కార్ వేగంగా పావులు కదుపుతున్నది. మేడిగడ్డ బరాజ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు పూనుకుంటున్నది. బరాజ్ కుంగుబాటుకు గురైన వెంటనే ఆగమేఘాల మీద ఎన్డీఏస్ఏ నిపుణుల కమిటీని రంగంలోకి దింపింది. ఈ కమిటీ ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే ప్రాజెక్టులో అనేక లోపాలున్నాయంటూ రెండు రోజుల్లోనే నివేదిక ఇచ్చింది. తదుపరి నివేదిక వచ్చేంతవరకూ బరాజ్‌లో నీటిని నిల్వ చేయొద్దని ఆదేశించింది. ఆ తరువాత మూడు నెలల వరకు బరాజ్ వైపు కన్నెత్తి చూడలేదు. మార్చి మొదటి వారంలో బరాజ్ ప్రమాద అధ్యయనం, పునరుద్ధరణ పనుల సిఫారసుల కోసం పేరుకు నిపుణుల కమిటీని నియమించింది. ఇప్పటికీ నివేదికను ఇవ్వలేదు. ఒకవైపు ఈ ఏడాది గోదావరిలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తున్నా, బరాజ్ రక్షణపై ఆసక్తి చూపడం లేదు. కనీసం తాత్కాలిక మరమ్మతు పనులనైనా సిఫారసు చేయడం లేదు. బరాజ్‌ను పూర్తిగా వరదలకు వదిలేసి, ఇప్పటికే జరిగిన నష్టాన్ని మరింతగా విస్తరించేలా చేసి, మొత్తంగా మేడిగడ్డ బరాజే పనికిరాదని నిర్ధారించేలా ఎన్డీఎస్ఏ వ్యవహార శైలి ఉన్నదనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికిప్పుడు మరమ్మతు పనులకు సిఫారసు చేసినా, వాటిని చేపట్టేలోగా వరదలు ముంచెత్తే అవకాశం ఉన్నదని ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. ఆ పనులను ఇప్పుడు చేసే అవకాశమే లేదని తేల్చిచెప్తున్నారు. దీంతో ఎన్డీఎస్ఏను అడ్డం పెట్టుకుని ఎగువన మేడిగడ్డ బరాజ్‌ను నిర్వీర్యం చేయాలన్న బీజేపీ సర్కార్ కుట్ర సఫలీకృతం అవుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

దేశంలో ఎక్కడాలేని విధంగా షరతులు

దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి నీటి వనరులను సమకూర్చేందుకు సమ్మక్క బరాజ్‌ను తెలంగాణ సర్కార్ నిర్మించింది. ఆ బరాజ్‌లో నీటి నిల్వ వల్ల తమ రాష్ట్రంలోని భూములు ముంపునకు గురవుతాయని ఛత్తీస్‌గఢ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నది. సీడబ్ల్యూసీకి సైతం ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కారు సమర్పించిన సమ్మక్క బరాజ్ డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ ఛత్తీస్‌గఢ్ పరిశీలనకు పంపింది. ఆ తరువాత అంతర్రాష్ట్ర అనుమతులు పొందాలంటే, పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్ నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)ని తీసుకోవాలని తెలంగాణకు సూచించింది. ఎన్‌వోసీ ఇస్తేనే ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు వచ్చే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌తో సంప్రదింపులు జరిపింది. సమ్మక్క బరాజ్ ఎఫ్ఆర్ఎల్ (పూర్తిస్థాయి నీటినిల్వ) 83 మీటర్లు కాగా, ఆ మేరకు నీటిని నిల్వ చేసినప్పుడు మాత్రమే ఛత్తీస్‌గఢ్‌లో భూములు ముంపునకు గురవుతాయని, ఆయా భూములకు పరిహారం చెల్లిస్తామని, అప్పటివరకు 80 మీటర్ల వరకే నీటిని నిల్వ చేస్తామని తెలంగాణ హామీ ఇచ్చింది. ముంపునకు గురయ్యే భూములు, పరిహారం నిర్ణయించి ఆ మేరకు వ్యయాన్ని తెలిపితే నిధులు చెల్లిస్తామని ఛత్తీస్‌గఢ్ ఎదుట తెలంగాణ ప్రతిపాదించింది. గత నవంబర్‌లోనే ఛత్తీస్‌గఢ్ అధికారులు ప్రాజెక్టును సందర్శించారు. ముంపు తదితర అంశాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఎన్‌వోసీ ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్‌లోని అప్పటి కాంగ్రెస్ సర్కార్ సుముఖత వ్యక్తం చేసింది. కానీ, ఆ రాష్ట్రంలో కొత్తగా కొలువుతీరిన బీజేపీ సర్కారు ఇప్పుడు కొత్త మెలిక పెట్టింది. ఎఫ్ఆర్ఎల్ 83 మీటర్ల వరకు కాకుండా, హెచ్ఎఫ్ఎల్ (హైఫ్లడ్ లెవల్) 88 మీటర్ల వరకు ముంపునకు గురయ్యే భూములకు సైతం పరిహారం చెల్లించాలని షరతు విధించింది. వాస్తవంగా దేశంలో ఏ ప్రాజెక్టులోనైనా ఎఫ్ఆర్ఎల్ వరకు మాత్రమే పరిహారం చెల్లిస్తున్నారు. హెచ్ఎఫ్ఎల్ వరకు భూసేకరణ అనేది ఇప్పటివరకు దేశంలోనే ఉనికిలో లేదు. అయినప్పటికీ ఎక్కడాలేనివిధంగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజేపీ సర్కార్ కొత్త మెలిక పెట్టింది. సమ్మక్క బరాజ్‌కు సీడబ్ల్యూసీ అనుమతులు రాకుండా చేసి, వెరసి పూర్తిస్థాయిలో అంటే 83 ఎఫ్ఆర్ఎల్ వరకు నీటిని నింపకుండా చూసి, ఇచ్చంపల్లిని నిర్మించాలనే కుట్రలో భాగంగానే ఛత్తీస్‌గఢ్‌ను అడ్డుపెట్టుకుని బీజేపీ ఇదంతా చేస్తున్నదనే విమర్శలున్నాయి. మొత్తంగా తమిళనాడు కోసం మేడిగడ్డను, సమ్మక్క బరాజ్‌ను నిర్వీర్యం చేసేందుకు బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలకు బలాన్నిస్తున్నాయి.

3) Recently, the Medigadda barrage (of Kaleshwaram project) belonging to Telangana state which is located upstream of Inchampalli got sunk due to the failure of the foundation structures of the barrage. In case if Medigadda cannot be revived, then there is a scope to increase the height of the Inchampalli barrage to cater to the needs of both ILR component and also Telangana specific requirements that would be fulfilled by Medigadda. NWDA was also asked to look into this matter and report back.

నదుల అనుసంధానం ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం ఎజెండాలో ఒక పాయింట్

మేడిగడ్డతో పనిలేదు.. ఇచ్చంపల్లి ఎత్తు పెంచేద్దాం!

ఎన్‌డబ్ల్యూడీఏ కొత్త ప్రతిపాదన

హైదరాబాద్, ఏప్రిల్18 (నమస్తే తెలంగాణ): 'మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించకపోతే ఇచ్చంపల్లి ఎత్తు పెంచి నదుల అనుసంధానం ప్రాజెక్టు, తెలంగాణ రాష్ట్రం రెండింటి అవసరాలను తీర్చవచ్చు' ఇదీ తాజాగా నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) చేసిన ప్రతిపాదన. దీనిపై శుక్రవారం ఢిల్లీలో నిర్వహించనున్న నదుల అనుసంధానం ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ కమ